TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 89 | శనివారం, జూలై 27, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

# ధరణిపై రేవంత్ సమీక్ష




**హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో ధరణిపై నేడు సమీక్ష నిర్వహించారు.

ఈ సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ సీఎస్ శాంతికుమారి, కోదండరెడ్డి, కే కేశవరావు పాల్గొన్నారు. ధరణిలో సమస్యలు, మార్పులు – చేర్పులు ఇతర అంశాలపై సమీక్ష జరిపారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... ధరణి సమస్యల పరిష్కారానికి లోతుగా అధ్యయనం చేయాలన్నారు. శాశ్వత పరిష్కారం చేపట్టాలని సూచించారు. నవరణల వల్ల కొత్త సమస్యలు రాకుండా చూడాలన్నారు. మార్పులు, చేర్పులపై ప్రజాభిప్రాయం, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. వారి అభిప్రాయాల మేరకు సమగ్ర చట్టం తేవాలన్నారు. అవసరమైతే అసెంబ్లీలో ధరణిపై చర్చ చేపడదామన్నారు.

**జీవో 317పై మంత్రివర్గ ఉపసంఘం సమావేశం**

జీవో 317పై మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. సమావేశంలో కేబినెట్ సబ్ కమిటీ ఛైర్మన్ దామోదర రాజనర్సింహ, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.

### భారత్‌లో ఏటా 2.5 శాతం పెరుగుతున్న

# క్యాన్సర్ కేసులు

### లోక్‌సభకు వెల్లడించిన జేపీ నడ్డా



న్యూఢిల్లీ: భారత్‌లో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో క్యాన్సర్ రోగులకు అందుబాటు ధరలో చికిత్స, మందులు అందించేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా లోక్‌సభకు తెలిపారు. శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడిన జేపీ నడ్డా.. భారత్‌లో ఏటా క్యాన్సర్ కేసులు 2.5 శాతం పెరుగుతున్నట్లు వెల్లడించారు. పురుషుల్లో నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్లు, మహిళల్లో రొమ్ము క్యాన్సర్ కేసులు పెరుగుతున్నట్లు చెప్పారు. దేశంలో ఏటా 15.5 లక్షల క్యాన్సర్ కేసులు నమోదవుతున్నట్లు సభకు వివరించారు. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో క్యాన్సర్ చికిత్స కోసం వినియోగించే మందుల ధరలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు నియంత్రిస్తోందని తెలిపారు. ప్రభుత్వం విధించిన ధరల పరిమితి కారణంగా రోగులకు ఏటా రూ.294 కోట్లు ఆదా అవుతోందన్నారు. ఇక హెల్త్‌కేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై సభ్యులు అడిగిన మరో ప్రశ్నకు నడ్డా స్పందిస్తూ.. ఈ విషయం ప్రభుత్వం దృష్టిలో ఉందని చెప్పారు. ఎక్కువ మంది వైద్యులు ఉండేలా మెడికల్ కాలేజీల విస్తరణ జరుగుతోందని వివరించారు. వైద్య విద్య యొక్క నాణ్యత, పరిమాణంలో సమతుల్యత ఉండాలన్నారు.

### పెట్రో ధరల తగ్గింపుపై ఆర్థిక మంత్రి

# కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపుపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జీఎస్టీ కౌన్సిల్ ఇంధన ధరల తగ్గింపుపై ఓ నిర్ణయం తీసుకుంటుందని ఆమె వెల్లడించారు. అయితే రాష్ట్రాలు ఈ విషయంలో కలిసివస్తే ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. నిర్మలా సీతారామన్ శుక్రవారం ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ పలు అంశాలపై మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగలేదని చెప్పారు. బీజేపీ భాగస్వామ్య పక్షాలు అధికారంలో ఉన్న ఏపీ, బిహార్‌లను మాత్రమే బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారని విపక్షాల విమర్శలను ఆమె తోసిపుచ్చారు. 2014లో రాష్ట్ర విభజన జరిగిన క్రమంలో ఏపీకి విభజన చట్టం ప్రకారం సాయం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. గతంలో మాదిరే రాష్ట్రాలకు కేటాయింపులు జరిగాయని, ఏ ఒక్క రాష్ట్రానికీ నిధులను నిరాకరించలేదని అన్నారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఏపీ నూతన రాజధాని నిర్మాణంతో పాటు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం సాయం చేయాల్సి ఉందని చెప్పారు. మరోవైపు మోదీ 3.0 ప్రభుత్వ తొలి బడ్జెట్‌పై విపక్షాలు భగ్గుమన్నాయి.

### ప్రజలకు ఇబ్బందులు లేకుండా...

# ఎల్.ఆర్.ఎస్ అమలు




**హైదరాబాద్ :** ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యంత పటిష్టంగా లే అవుట్ రెగ్యులైజేషన్ స్కీమ్ (ఎల్.ఆర్.ఎస్)ను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతోంది. అందులో భాగంగా ఈ రోజు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన కార్యాలయలంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేంలోనే ఎల్.ఆర్.ఎస్ విధివిధానాలపై పూర్తి స్థాయిలో కసరత్తు నిర్వహించారు. ఎల్.ఆర్.ఎస్ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారుకలు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. ఎల్.ఆర్.ఎస్ అనుమతుల కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులు వీలైనంత వేగంగా పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులకు సూచన చేశారు. ఇందు కోసం 33 జిల్లాల్లో ప్రత్యేకంగా ఒక టీములను రూపొందుకోవాలని చెప్పారు. సిబ్బంది కొరత ఉంటే ఇతర శాఖల నుంచి డెప్యుటేషన్ తీసుకోవాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఫైనాన్స్ చీఫ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రామకృష్ణారావు, ల్యాండ్ అండ్ రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ సెక్రెటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, జీహెచ్ఎంసీ కమిషనర్ కాట అమ్రపాలి, గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వీపీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆగస్టులోనే పంచాయతీ ఎన్నికలు..!

### రిజర్వేషన్ల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి

# కీలక నిర్ణయం..!!



హైదరాబాద్ : తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు మరి కొద్దిరోజుల్లోనే నగారా మోగనుంది. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసి, ఆగస్టు నెల చివరి వరకు పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే ఐదేండ్ల క్రితం ఎన్నికల్లో కేటాయించిన రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు సమాచారం. ఈ రోజు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే సర్పంచుల పదవీకాలం ముగిసి ఆరు నెలలు కావస్తున్నందున రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు లేకుండా గత రిజర్వేషన్లలే కొనసాగించాలని, ఆగష్టు నెలలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సమావేశంలో మంత్రి సీతక్కతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి వారం రోజుల క్రితం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలు, రాబోయే ఎన్నికల్లో వాటి పెంపునకు సంబంధించిన అంశాలను వెల్లడించాలని అధికారులకు సీఎం సూచించారు.

### నీతి ఆయోగ్ సమావేశానికి సిఎం రేవంత్ రెడ్డి

# హాజరు కాబోవడం లేదు



హైదరాబాద్: రాష్ట్ర హక్కులను దెబ్బతీయడం, నిధులు విడుదల చేయకపోవడం వంటి వాటికి నిరసనగా ఢిల్లీలో జులై 27 న జరిగే నీతి ఆయోగ్ సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరు కాబోవడం లేదు. కేంద్ర బడ్జెట్ లో చూపిన వివక్షకు వ్యతిరేకంగా తాను నీతి ఆయోగ్ సమావేశానికి హాజరు కానని రేవంత్ రెడ్డి శాసన సభలోనే జులై 24న తీర్మానంపై చర్చ జరిగేప్పుడు తెలిపారు. “ప్రధాని నరేంద్ర మోడీ నీతి ఆయోగ్ సమావేశానికి అధ్యక్షత వహిస్తున్నారు. నీతి ఆయోగ్ సమావేశం జులై 27న జరుగనున్నది. తెలంగాణ ముఖ్యమంత్రిగా (నేను) నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నాను.

# కొత్తింటికి మారనున్న రాహుల్ గాంధీ




న్యూఢిల్లీ: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి కేంద్ర ప్రభుత్వం కొత్త నివాసాన్ని కేటాయించబోతోంది. సునేహ్రి బాగ్ రోడ్డులోని బంగ్లా నెంబర్ 5ను ఆయనకు ఆఫర్ చేసింది హౌస్ కమిటీ. ఆయన సోదరి ప్రియాంక గాంధీ ఆ ఇంటిని చూడడానికి రావడంతో ఈ విషయం గుప్పుమంది. ప్రస్తుతం ఆయన ప్రతిపక్ష నేత హోదాలో ఉన్నారు. ఇదివరలో ఆయనపై సుప్రీం కోర్టు అనర్హత వేటు పడగా, ఆయన అధికార నివాసాన్ని కూడా ఖాళీ చేయించారు. అప్పటి నుంచి ఆయన తన తల్లి సోనియా గాంధీ నివాసంలోనే ఉంటూ వచ్చారు. కానీ నేడు రోజులు మారాయి. ఆయనకు మంచి రోజులు వచ్చాయి.

### ఉనికి కోసమే పాక్...

# ‘ఉగ్రవాదం, పరోక్ష పోరు’

### - అమరులైన భారత జవాన్లకు

# పిఎం మోడీ నివాళులు



ద్రాస్(కార్గిల్): కార్గిల్ యుద్ధంలో అమరులైన భారత జవాన్లకు పిఎం మోడీ ఘన నివాళులర్పించారు. భారత భూభాగాన్ని ఆక్రమించాలని ప్రయత్నించిన పాకిస్థాన్ సైనికులను తిప్పికొట్టి నాటి యుద్ధంలో అమరులైన వీర జవాన్లకు పిఎం మోడీ నివాళులర్పించారు. కార్గిల్ యుద్ధం జరిగి నేటికి ఇరవై ఐదు సంవత్సరాలు. కార్గిల్ 25వ విజయ్ దివాస్ ను పురస్కరించుకొని కార్గిల్ లోని ద్రాస్ లో గల యుద్ధ వీరుల స్మారకాన్ని ప్రధాని మోడీ సందర్శించారు. పాకిస్థాన్ చరిత్ర నుంచి ఎలాంటి పాఠాలు నేర్చుకోలేదని, ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడినా ఓటమి చవిచూడాల్సి వచ్చిందని ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా సైనికులకు నివాళులు అర్పిస్తూ సైనికుల త్యాగాలు అజరామరమని అన్నారు. ఉగ్రవాదం మరియు ప్రాక్సీ వార్ ద్వారా పాకిస్తాన్ సంబంధితంగా ఉండటానికి ప్రయత్నిస్తోందని, అయితే అది ఏదైనా దుష్ప్రవర్తనకు పాల్పడినప్పుడల్లా ఓటమిని ఎదుర్కొంటుందని ఆయన అన్నారు. “నేను టెర్రర్ ఆఫ్ మాస్టర్స్ నా గొంతును నేరుగా వినగలిగే ప్రదేశం నుండి మాట్లాడుతున్నాను. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారి నీచమైన ఆకృతులు ఎప్పటికీ విజయవంతం కావని నేను వారికి చెప్పాలనుకుంటున్నాను, ”అని ఆయన అన్నారు. “మా ధైర్యవంతులు ఉగ్రవాదాన్ని అణిచివేస్తారు మరియు శత్రువులకు తగిన సమాధానం ఇవ్వబడుతుంది” అని ఆయన నొక్కి చెప్పారు. జమ్మూ ప్రాంతంలో ఉగ్రవాద ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. కార్గిల్‌లో మనం యుద్ధంలో విజయం సాధించడమే కాదు, సత్యం, సంయమనం మరియు శక్తికి అద్భుతమైన ఉదాహరణ ఇచ్చామని మోదీ అన్నారు. జూలై 26, 1999న, భారత సైన్యం లడఖ్‌లోని కార్గిల్ యొక్క మంచుతో నిండిన ఎత్తులపై దాదాపు మూడు నెలల సుదీర్ఘ యుద్ధం తర్వాత విజయాన్ని ప్రకటించి, ‘ఆపరేషన్ విజయ్’ యొక్క విజయవంతమైన పరాకాష్టను ప్రకటించింది. యుద్ధంలో పాకిస్థాన్‌పై భారత్ సాధించిన విజయానికి గుర్తుగా ఈ రోజును ‘కార్గిల్ విజయ్ దివస్’గా పాటిస్తారు. లడఖ్ మరియు జమ్మూ కాశ్మీర్ అభివృద్ధిలో ప్రతి అవరోధాన్ని భారతదేశం ఓడిస్తుందని కూడా ప్రధాని అన్నారు.

# ఎస్ఎల్బీసీ టన్నెల్ నిర్మాణానికి వేగవంతం... అమెరికా నుంచి మెషీన్లు: మంత్రి కోమటిరెడ్డి



**నల్గొండ :** నల్లగొండ జిల్లాలోని ఎస్ఎల్బీసీ టన్నెల్ నిర్మాణం కోసం త్వరలో అమెరికా నుంచి యంత్రాలను తెప్పించనున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. శుక్రవారం నల్లగొండ మండలంలోని దొనకల్ గ్రామంలో రూ 3 కోట్లతో నిర్మించనున్న 33/11 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నల్లగొండ పట్టణంలో ప్రజాదర్బార్ నిర్వహించిన ఆయాన ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తమది రైతు సంక్షేమ ప్రభుత్వం అన్నారు. గత ప్రభుత్వాలు మునుపెన్నడు వ్యవసాయ రంగానికి కేటాయించని విధంగా బడ్జెట్లో 72,659 కోట్లను కేటాయించామన్నారు. రూ 31 వేల కోట్ల రూపాయలతో రుణమాఫీని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో 80 కోట్ల రూపాయల వ్యయంతో 20 ఎకరాలలో సమీకృత వసతి గృహ నిర్మాణాలను చేపడతామని చెప్పారు. ఎస్ఎల్బీసీ సొరంగం, బ్రాహ్మణ వెల్లంల, శివన్న గూడెం, పాలమూరు రంగారెడ్డి , సీతారామ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఈ బడ్జెట్లో అధిక నిధులను కేటాయించిందని మంత్రి వెంకటరెడ్డి తెలిపారు. కాగా, తెలంగాణ బడ్జెట్‌పై గగ్గోలు పెడుతున్న కేసీఆర్ కేంద్ర బడ్జెట్‌పై ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్పాలని మంత్రి కోమటిరెడ్డి రెడ్డి డిమాండ్ చేశారు. . తెలంగాణకు బడ్జెట్‌లో అన్యాయం చేస్తే కేంద్రంపై ఇప్పటికి కేసీఆర్ ఎందుకు మాట్లాడటం లేదన్నారు. బడ్జెట్‌లో కేటాయింపుల విషయంలో జరిగిన అన్యాయాన్ని అదే రోజు సాయంత్రం ప్రెస్ మీట్ పెట్టి రేవంత్ రెడ్డి ఖండించారని గుర్తు చేశారు. బీజేపీ వైపు బీఆర్ఎస్ అడుగులు పడుతున్నాయని అందుకే తెలంగాణ వ్యతిరేక బడ్జెట్ పెట్టినా నోరు మెదపడం లేదని ఆరోపించారు.

ఏపీ, బీహార్‌లలో ఎన్డీయేకు మద్దతు ఇచ్చినందుకే భారీగా నిధులు కేటాయించారన్నారు. వారు మద్దతు ఉపసంహరించుకుంటే ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని అప్పుడు రాహుల్ గాంధీ ప్రధాని అవుతారన్నారు. ఆ భయంతోనే బీజేపీ ఆ రెండు రాష్ట్రాలకు భారీగా కేటాయింపులు జరిపిందన్నారు. తాము నీతి అయోగ్ మీటింగ్‌కు అసెంబ్లీలోనే తేల్చి చెప్పామని.. కేసీఆర్ ఎందుకు మౌనం వహిస్తున్నారని ఫైర్ అయ్యారు. వ్యవసాయ రంగానికే రూ.73 వేల కోట్లు బడ్జెట్‌లో తాము ఉంచామని అయినా బీఆర్ఎస్ నేతలు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని కోమటిరెడ్డి మండిపడ్డారు. కేవలం 6 నెలల కోసమే తమ ప్రభుత్వం ఇంత పెద్ద మొత్తాన్ని బడ్జెట్‌లో పెట్టిందని, చెప్పిన పథకాలతో పాటు కొత్త వాటిని కూడా తమ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు.


# రెండో దశలో కోకాపేట వరకు మెట్రో రైలు



హైదరాబాద్: నగరంలో మెట్రో రైలు రెండో దశ, దూరం అంచనాలు పెంచారు. రెండో దశలో ప్రభుత్వం ప్రతిపాదనలను సమీక్షించి కొత్త ప్రతిపాదనలను రూపొందించినట్లు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. మొదట రాయదుర్గం నుంచి విప్రో కూడలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లోని యూఎస్ కాన్సులేట్ వరకు 8 కిమీ. దూరాన్ని ప్రతిపాదించారు. అయితే ఇప్పుడు దీనిని కోకాపేటలోని నియోపోలిస్ వరకు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో మరో 3.3 కిమీ. పెరిగింది. దాంతోపాటు అంచనాలు కూడా పెరిగాయి. నాగోలు, ఎల్బీనగర్, చాంద్రాయణ గుట్ట, మైలార్ దేవ్ పల్లి కూడలి నుంచి జల్ పల్లి మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకు మొదట 29 కిమీ. ఎయిర్ పోర్ట్ మెట్రో మార్గాన్ని అంచనా వేశారు. అయితే దీనిని 4 కిమీ. పెంచారు. ఇదే కారిడార్ లో మైలార్ దేవ్ పల్లి నుంచి ఆరాంఘడ్, కొత్త హైకోర్టు వరకు 5 కిమీ. మెట్రో మార్గాన్ని పెంచారు. రెండో దశలో దీనిని ప్రతిపాదించారు. కాగా నాగోలు, ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట మెట్రో ఇంటర్ చేంజ్ స్టేషన్లను అభివృద్ధి చేయనున్నట్లు తన బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు.

# ఐదుగురు ఘరానా నక్సల్స్ లొంగుబాటు

సుక్మా (ఛత్తీస్‌గఢ్): మొత్తం రూ.19 లక్షల నగదు రివార్డు ఉన్న ఐదుగురు నక్సల్స్ గురువారం సుక్మా జిల్లా పోలీస్ అధికారుల ముందు లొంగిపోయారు. సీనియర్ నక్సల్స్ అరాచకాలు, అమానవీయం, శుష్క మావో సిద్ధాంతానికి నిస్పృహ చెంది వారంతట వారే లొంగిపోయినట్టు సుక్మా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కిరణ్ చావన్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ నక్సల్ నిర్మూలన విధానం, సంక్షేమ కార్యక్రమాలకు తాము ఆకర్షితులయ్యామని వారు చెప్పారని కిరన్ తెలిపారు. లొంగిపోయిన నక్సల్స్ ఐదుగురిలో ముగ్గురు మహిళలు ఉన్నారు. లొంగిపోయిన వారిలో కవాసి దుల(25), సోది బుధ్ర(27) మడ్కం గంగి( 27) వీరంతా చాలా క్రియాశీలంగా క్రమంగా డిప్యూటీ కమాండర్, సెక్షన్ కమాండర్, సెక్షన్ ఎ కమాండర్ క్యాడర్లలో ప్లాటూన్ నెం 30 మావోయిస్టులుగా పనిచేసేవారు. వీరిపై తలాఒక్కింటికి రూ.5 లక్షల నగదు రివార్డు ఉంది. మరో రెండు క్యాడర్లలో పోడియం సొండి(25), ప్లాటూన్ నెం. 30లో పార్టీ సభ్యులు. మక్కమ్ ఆయతే(35) కిస్తారం ఏరియా మావోయిస్టుల కమిటీ టైలర్ టీమ్‌లో సభ్యురాలు. వీరిద్దరి తలపై చెరో రూ.2 లక్షల వంతున నగదు రివార్డు ఉంది. సుక్మా పోలీస్ యాంటీ నక్సల్ సెల్ లోని నిఘా విభాగం, పొరుగున ఉన్న ఒడిశా పోలీస్‌లు ఈ నక్సల్స్ లొంగుబాటుకు కీలక పాత్ర వహించారని



చావన్ తెలిపారు. ఈ ఐదుగురు నక్సల్స్ పోలీస్ బృందాలపై దాడులు, రోడ్ల ధ్వంసం వంటి దారుణాలకు పాల్పడ్డారని చావన్ వివరించారు. వీరందరికీ ఒక్కొక్కరికి రూ.25, 000 ఆర్థిక సాయం అందజేయడమైందని, ఇంకా పునరావాసం కల్పించడమౌతుందని తెలిపారు.

# చెట్టు కూలి యువకుడి మృతి



చిన్నబోయినపల్లి: రాష్ట్రంలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఓ చెట్టు కూలి యువకుడి మృతి చెందిన సంఘటనా ములుగు జిల్లాలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే.. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం ములుగు జిల్లా ఏటూరు నాగరం మండలం చిన్నబోయినపల్లి కి చెందిన ఎస్ కే జహంగీర్ గ్రామంలో మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మందులు తీసుకు వచ్చేందుకు చిన్నబోయినపల్లి నుంచి ఏటూరునాగారానికి జాతీయ రహదారి 163పై బైక్ పై వెళ్తుండగా మార్గమధ్యలో పెద్ద చెట్టు కూలి జహంగీర్ పై పడింది. ఈ ఘటనలో జహంగీర్ ఘటనస్థలిలోనే మృతి చెందాడు. అటుగా వెళ్తున్న స్థానికులు చూసి గ్రామస్థలకు విషయం తెలియజేశారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు చెట్టును తొలగించి పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీశైలానికి పోటెత్తిన వరద

హైదరాబాద్ : ఎగువ నుంచి శ్రీ శైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం భారీగా పెరుగుతూ వస్తోంది. గురువారం సాయంత్రం రిజర్వాయర్‌లోకి 2.54లక్షల క్యూస్కెల వరదనీరు చేరుతుండగా, ప్రాజెక్టులో నీటినిలువ 92టిఎంసీలకు పెరిగింది. రిజర్వాయర్‌లో నీటిమట్టం సా యంత్రానికే 855అడుగులకు చేరుకుంది. ఎగువన మహారాష్ట్ర ,కర్ణాటకలో కురుస్తున్న వర్షాల తో ఆల్మట్టి ప్రాజెక్టులోకి 1.988లక్షల క్యూసెక్కు ల నీరు చేరుతుండగా, ప్రాజెక్టు నుంచి 2.75లక్షల క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ డ్యాం నుంచి 2.50లక్ష ల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎ గువ నుంచి జూరాలకు 2.27లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా, ప్రాజెక్టు నుంచి 2.50లక్షల క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. మరో వైపు తుంగభద్ర ప్రాజెక్టుకూ కూడా భా రీగా వదర ప్రవాహం వస్తోంది. ఎగువ నుంచి 98450 క్యూసెక్కుల నీరు చేరుతుండగా ప్రాజె క్టు నుంచి 98404క్యూసెక్కులు బయటకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటినిలు వ సామర్థం 105టిఎంసీలు కాగా, గురువారం సాయంత్రానికి 100టిఎంసీలకు చేరుకుంది.




**భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక**

గోదావరిలో వరద ప్రవాహం కొనసాగుతోంది. నదిలో నీటిమట్టం 48అడుగులు ఉండగా , రెం డవ ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. నదిలో 10.11లక్షల క్యూసెక్కువ వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువనుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 21650క్యూసెక్కుల నీరు చేరుతోంది. కడెం ప్రాజెక్టులోకి 10536క్యూసెక్కుల నీరు చేరుతుండగా ,ప్రాజెక్టు నుంచి 13082క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దిగువన ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 20998క్యూసెక్కుల నీరు చేరుతోంది.

**ప్రాణహితకు తగ్గిన వరద:**

గోదావరికి ప్రధాన ఉపనదిగా ఉన్న ప్రాణహితకు వరద స్వల్పంగా తగ్గింది. గురువారం ప్రాణహి త నుంచి మేడిగడ్డ బ్యారేజికి 7.71లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండగా ,వచ్చిన నీటిని వచ్చినట్టుగా దిగువకు వదులు తున్నారు. దుమ్ముగూడెం వద్ద గోదావరిలో నీటి ప్రవాహం 11. 47లక్షల క్యూసెక్కులు ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.

# పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్.. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి




తొర్రూరు : రాష్ట్రంలో ఉన్న పేదలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. పాలకుర్తి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అనారోగ్యానికి గురైన బాధితులకు రూ.11 లక్షల 81వేల మంజూరైన చెక్కులను స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డిలు మాట్లాడుతూ%ॐ% తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతి పేదవాడికి పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి అర్హులైన పేదలకు న్యాయం జరుగుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారానే కాకుండా ఆరోగ్య శ్రీ పథకం వర్తించని వ్యాధులకు పేదలను ఆదుకోవడం కోసం సీఎం రేవంత్ రెడ్డి లక్షల రూపాయలను మంజూరు చేస్తున్నారని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం.. ప్రభుత్వం రూపొందించిన పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడాలేని విధంగా మన రాష్ట్రంలో ప్రజాకర్షణ పథకాలకు రూపకల్పన చేసిన సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా బంగారు తెలంగాణ నిర్మాణం కోసం కృషి చేస్తున్నారన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి లబ్ధిదారుల తరపున ధన్యవాదాలు తెలిపారు.

# ఐ-ఫోన్లపై బంపరాఫర్...

## గణనీయంగా ధరలు తగ్గించిన ఆపిల్..!

స్మార్ట్ ఫోన్ ప్రియులకు శుభవార్త. గ్లోబల్ టెక్ దిగ్గజం ఆపిల్ తన ఐ-ఫోన్ 13,14,15 సిరీస్ ఫోన్ల ధరలు తగ్గిస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ మీద కస్టమ్స్ డ్యూటీ తగ్గిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో ప్రతిపాదనలు సమర్పించిన సంగతి తెలిసిందే. తదనుగుణంగా ఆపిల్ తన ఐ-ఫోన్ 13,14,15 సిరీస్ ఫోన్ల ధరలు తగ్గించింది. దీంతో భారతీయ స్మార్ట్ ఫోన్ యూజర్లకు లబ్ధి చేకూరనున్నది. ఆపిల్ ఐ-ఫోన్ ప్రో లేదా ప్రో మ్యాక్స్ మోడల్ ఫోన్ల ధరలు రూ.5,100 నుంచి రూ.6,000 వరకూ తగ్గనున్నాయి. ఐ-ఫోన్ 13, ఐ-ఫోన్ 14, ఐ-ఫోన్ 15 సిరీస్ లతోపాటు భారత్ లో తయారయ్యే ఐ-ఫోన్ల ధరలు రూ.300, ఐ-ఫోన్ ఎస్ఈ ధర రూ.2300 తగ్గనున్నది.



ఆపిల్ తన ఐ-ఫోన్ ప్రో మోడల్ ఫోన్ల ధరలు తగ్గించడం ఇదే తొలిసారి. 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్లో కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ మీద బేసిక్ కస్టమ్స్ డ్యూటీ 20 నుంచి 15 శాతానికి తగ్గించింది. సంప్రదాయంగా కొత్త ఐ-ఫోన్ మార్కెట్లో ఆవిష్కరిస్తున్నప్పుడు పాత మోడల్ ఫోన్ల ధరలు తగ్గిస్తూ వస్తుంది. ఆపిల్ ధర తగ్గింపుతోపాటు డీలర్లు, రీసెల్లర్లు తమ వద్ద ఉన్న నిల్వల సేల్స్ క్లియర్ చేసుకోవడానికి అదనపు డిస్కౌంట్లు ప్రకటిస్తుంటారు.

**ఫోన్ మోడల్ - పాత ధర - కొత్త ధర**

ఐ-ఫోన్ ఎస్ఈ -రూ.49,900- రూ. 47,600

ఐ-ఫోన్ 13 - రూ. 59,900 - రూ.59,600

ఐ-ఫోన్ 14 - రూ.69,900 - రూ. 69,600

ఐ-ఫోన్ 14 ప్లస్ - రూ.79,900 -రూ. 79,600

ఐ-ఫోన్ 15 - రూ.79,900 - రూ.79,600

ఐ-ఫోన్ 15 ప్లస్ - రూ.89,900 - రూ.89,600

ఐ-ఫోన్ 15 - రూ. 1,34,900 - రూ. 1,29,800

ఐ-ఫోన్ 15 ప్రో మ్యాక్స్ - రూ. 1,59,900 - రూ. 1,54,000

## సంపాదకీయం

శనివారం, జూలై 27, 2024

# చేనేతకు ప్రగడ కోటయ్య చేయూత

భారత స్వాతంత్ర్యోద్యమములో ప్రధాన భూమిక పోషించి, స్వాతంత్ర్య సమపార్జనకు ఒక సాధనంగా నిలిచింది చేనేత. అలాంటి చేనేత రంగానికి, కార్మికులపై జరిగిన నిర్లక్ష్యం, నిరాదరణ గురించి అనునిత్యం తపించిన చేనేత నాయకుడు ప్రగడ కోటయ్య. చేనేత కార్మికులను సంఘటితం చేసి, అహరహం ఎన్నో పోరాట రూపాలలో ప్రత్యక్షంగా పాల్గొని, వారి ఆత్మ బంధువు గా వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయిన నేత ఆయన. ప్రగడ కోటయ్య గుంటూరు జిల్లా, నిడుబ్రోలులో చేనేత వృత్తిగా గల ప్రగడ వీరభద్రుడు, కోటమ్మ దంపతులకు 1915, జూలై 26న జన్మించాడు. 1931లో ఎస్ఎస్ఎల్సి స్కూలు ఫైనల్ ప్యాసయ్యాడు. కొంతకాలం బాపట్ల తాలూకా బోర్డులో ఉపాధ్యా యుడుగా చేసాడు. ఆక్స్ ఫర్డు విశ్వ విద్యాలయంలో భారతీయ చేనేత పరిశ్రమ పై పరిశోధన జరిపిన ఆచార్య ఎన్ జి రంగా సలహా మేరకు మద్రాసు లోని టెక్స్టైల్స్ ఇన్స్టిట్యూట్ చదివి అక్కడ సూపర్వైజర్ పని చేసాడు. 1935లో ఏర్పడిన మద్రాసు రాష్ట్ర చేనేత పారిశ్రా మికుల సహకార సంఘంలో ప్రొడక్షన్ ఇన్చార్జిగా ఉద్యోగంలో చేరి సర్కారు జిల్లాల్లో ప్రాథమిక చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేసేందుకు విశేషంగా కృషి చేశాడు. 1952 నుంచి 1962 వరకు రెండు పర్యాయాలు, తర్వాత 1957 నుంచి 1972 వరకు ఎమ్మెల్యేగా, 1974 నుంచి 1980 వరకు ఎమ్మెల్సీగా ఉన్నాడు. అనంతరం 1990 నుంచి 1995లో మరణించేంత వరకు రాజ్యసభ సభ్యునిగా ఉన్నాడు. 1974 నుంచి 1978 వరకు పీసీసీ ప్రధాన కార్యదర్శిగా పని చేసాడు. 1945లో ఏర్పడిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ వీవర్స్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్య తలు నిర్వహించాడు. 70వ జన్మదినం సందర్భంగా చీరాలలో జరిగిన సభలో ఆనాటి ఉత్తరప్రదేశ్ గవర్నర్ బెజవాడ గోపాలరెడ్డి, ఇతడికి 'ప్రజాబంధు' బిరుదునిచ్చి సత్కరించారు. కోటయ్య మరణాంతరం రాష్ట్ర ప్రభుత్వం వెంకటగిరిలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ సంస్థకు ప్రగడ కోటయ్య పేరు పెట్టింది. మెడికల్ సెలక్షన్ కమిటీ సభ్యుని గా, ప్రదేశ్ కాంగ్రేశ్ కమిటీ జనరల్ సెక్రటరీగా ఆంధ్ర విశ్వ విద్యాలయం సెనేట్ సభ్యునిగా పదవీ బాధ్యతలు సమర్ధ వంతంగా ప్రగడ కోటయ్య నిర్వహించారు. 1937 జూన్లో నిడుబ్రోలులో గుంటూరు జిల్లాలో ఎన్.జి.రంగా, తాడిపర్తి శ్రీకంఠం, దావెర్ల రమాకాంతరావు, రామనాథం రామదాసు, పెండెం వెంకట్రాములు మొదలైన ప్రముఖ నాయకులు పాల్గొన్న చేనేత మహా సభను వెనుక వుండి నడిపించింది ప్రగడ కోటయ్యే. అప్పటి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి సి. రాజగోపాలా చారి ముఖ్య అతిథిగా గుంటూరులో చెన్న రాష్ట్ర చేనేత మహాసభ వెనక కృషి ఆయనదే. 1941లో బ్రిటిష్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేనేత రంగం స్థితిగతులను అధ్యయనం చేసేందుకు నియమిత థామస్ కమిటీని కోటయ్య గుంటూరు జిల్లాకు ఆహ్వానించి వంద పేజీల మెమొరాండాన్ని అందజేశాడు. చేనేత పారిశ్రామికులకు చాలినంత నూలు సరఫరా చేయాలని, నూలు ధరలు అదుపులో పెట్టాలని, నూలు ఎగుమతులు ఆపాలని నినదిస్తూ ఆందోళనలు చేపట్టాడు. 1950 వరకు పరిస్థితులలో మార్పు రాలేదు. దాంతో చేనేత కాంగ్రెస్ సమర శంఖం పూరించింది. అన్ని జిల్లాల్లో ఆకలి యాత్రలు, సత్యాగ్రహాలు పెద్దఎత్తున చేపట్టాడు. అయినా ఫలితం రాలేదు. దాంతో మద్రాసు నగరంలో 1950 ఏప్రిల్ 16 నుంచి జూన్ 30 వరకు 75 రోజుల పాటు కోటయ్య సత్యాగ్రహం నడిపాడు. దాదాపు పదివేల మంది చేనేత కార్మికులు ఈ సత్యాగ్రహంలో పాల్గొన్నాడు. 75 రోజుల అనంతరం కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి హరేకృష్ణ మెహతాబ్ మద్రాసు వచ్చి చేనేత కాంగ్రెస్ నాయకులతో చర్చలు జరిపాడు. మంత్రి ఇచ్చిన హామీలతో సత్యాగ్రహాన్ని విరమించాడు. 1952 మద్రాసు శాసనసభ ఎన్నికల్లో ప్రకాశం పంతులు, కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ అభ్యర్థిగా చీరాల నియోజకవర్గం నుంచి పోటీచేసి ఎన్నికయ్యాడు. శాసన సభలో కోటయ్య వాక్పటిమను చూసిన ఆనాటి ముఖ్యమంత్రి రాజాజీ, కాంగ్రెసు పార్టీలో చేరితే మంత్రి పదవి అప్పగిస్తానని చెప్పినా, కోటయ్య నైతిక విలువలకే ప్రాముఖ్యతనిచ్చి ఆ అవకాశాన్ని సున్నితంగా తిరస్కరించిన నిస్వార్ధ నేత. 1953 తర్వాత చేనేత వర్గాల ప్రయోజనాల కోసం రేపల్లెలో సత్యాగ్రహం చేపట్టాడు. ఫలితంగా జైలు శిక్ష అనుభవించాడు. కనుంగో కమిటీ సిఫార్సులకు వ్యతిరేకంగా ఆయన ఉద్యమించాడు. చేనేత కార్మికులకు ప్రయోజనం కలిగిం చేందుకు సహకార సంఘాలు ఒక మార్గంగా నమ్మాడు. చేనేత రంగంతో పాటు రైతులు, జిన్నింగ్, స్పిన్నింగ్, కాంపోజిట్ మిల్లులపై ఆమూలాగ్రం అధ్యయనం చేశాడు. ఆయన హయాం లోనే ఆంధ్ర ప్రాంతంలో ఆనాడు 200 పైగా నూతన చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేసారు. అసంఘటితంగా ఉన్న చేనేత రంగం అభివృద్ధికి వారు నేసి బట్టలకు సరైన గిట్టుబాటు ధర లభించడానికి కోటయ్య కృషి చేసాడు. చీరాల వద్ద 17 వేల ఎకరాలకు పైగా బంజరు భూములను పేదలకు పంపిణీ చేసే విషయంలో చీరార సముద్ర తీర ప్రాంతంలో సేద్యపు నీటి సౌకర్యం కల్పించడంలో చీరాల, నెల్లూరు, రాజమండ్రి పట్టణాలలో సహకార నూలు మిల్లులు ఏర్పాటు చేయడంలో కోటయ్య కృషి మరవ లేనిది.

# రాష్ట్ర ప్రభుత్వానికి విద్యారంగం పైన ఇంత వివక్ష ఎందుకు?

## - ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలు దగ్ధం




**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ సిరిసిల్ల:** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో బడ్జెట్లో విద్యారంగానికి తక్కువ కేటాయించడాన్ని నిరసిస్తూ బడ్జెట్ పత్రలను దగ్ధం చేసి నిరసన కార్యక్రమం చేసారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంద అనిల్, మల్లారపు ప్రశాంత్ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి విద్యారంగం పైన ఎందుకు ఇంత వివక్షని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధి చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బడ్జెట్లో నిరాశ మిగిల్చిందని అది కేవలం అంకెల గారడికి మాత్రమే సరిపోయే విధంగా ఉందని,కానీ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో వాటికి సరిపడా వసతులు లేక స్కాలర్షిప్స్ రాక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఇలాంటి సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న విద్యార్థులకు ఈ బడ్జెట్ ఏమాత్రం కూడా ఆశించదగిన స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. అదేవిధంగా రాష్ట్ర ఏర్పడినంక ప్రభుత్వం మొదటిసారి 10% విద్యారంగానికి కేటాయించిందని దాని తర్వాత ప్రతి సంవత్సరం తగ్గుతూ ప్రస్తుత బడ్జెట్లో 7.3% నిధులు కేటాయించడం వరకు పరిమితం అయింది అంటే విద్యారంగం పైన ఏమాత్రం కూడా సోయి లేకుండా విద్యా వ్యతిరేక విధానాల పైన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రయాణిస్తుందని మండిపడ్డారు. కొన్ని రాష్ట్రాలలో విద్యా రంగానికి వారి బడ్జెట్లలో పెద్దపీట వేస్తున్నారని మరి మన రాష్ట్రం అన్ని రంగాలలో ముందుందని మన ఖ్యాతి భారతదేశం లోనే గొప్ప స్థాయిలో తెలంగాణ ఉందని గొప్పలు చెప్పుకోవడం కే పరిమితం అవుతున్నారు తప్ప విద్యారంగం అభివృద్ధికి ఏమాత్రం కూడా ప్రభుత్వాలు పనిచేయడం లేదని అన్నారు. ప్రస్తుత బడ్జెట్ యూనివర్సిటీలకు కేవలం 500 కోట్లు కేటాయించడం సిగ్గుచేటని వీటితోనే ఏం సదుపాయాలు సౌకర్యాలు యూనివర్సిటీ విద్యార్థులకు అందుతాయని దానిని రాష్ట్ర ప్రభుత్వమే ఆత్మ విమర్శ చేసుకోవాలని అన్నారు. దాంతోపాటు బడ్జెట్ ప్రస్తావనలో సంక్షేమ రంగం పైన మెస్ బిల్లుల పైన, స్కాలర్షిప్స్ పైన ఏమాత్రం కూడా ప్రస్తావించకపోవడం విద్యార్థి లోకం ఆందోళనకు గురైన పరిస్థితి ఉందని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా బడ్జెట్లో విద్యారంగానికి 30 శాతం నిధులను కేటాయించి బడ్జెట్ని సవరించాలని డిమాండ్ చేయడం జరిగింది లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వానిపైన ఉవ్వెత్తున విరుచుకో పడే పరిస్థితి నెలకొంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కుర్ర రాకేష్, నాయకులు చిగుర్ల అనిల్, రవి, తరుణ్, అరుణ్, బాలకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో గంజాయి తాగేవారు

# తస్మాత్ జాగ్రత్త

### - జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లకు గంజాయి కిట్లు

### - డ్రంక్ అండ్ డ్రైవ్ తరహాలో తరచు తనిఖీలు - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ సిరిసిల్ల:** గంజాయి తాగే వారిని పట్టుకునేందుకు జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లకి గంజాయి టెస్ట్ కిట్లు అందుబాటులోకి వచ్చాయని ప్రతి పోలీస్ స్టేషన్ లలో రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ తరహాలోనే గంజాయి టెస్ట్ నిర్వహించి వాటికి బానిసై తాగే వారిని పట్టుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్ పి అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ, సిరిసిల్ల టౌన్ సి.ఐ లతో కలసి గంజాయి కిట్లను జిల్లా ఎస్పీ ఆవిష్కరించారు. జిల్లాలో గంజాయి కిట్ల సహాయంతో పరీక్షలు నిర్వహించి గంజాయి సేవించినవారు మరియు వారికి సరఫరా చేసిన 8 మందిపై కేసులు నమోదు చేసి 390 గ్రాముల గంజాయి ,5 గంజాయి సిగరెట్లు స్వాధీనం చేయడం జరిగిందని,గంజాయికి అలవాటు పడి తాగేవారు తస్మాత్ జాగ్రత్తగా ఉండలని హెచ్చరించారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడాని జిల్లా పోలీస్ విస్తృత కార్యక్రమలు చేపడుతూ ప్రజల్లో అవగాహన కల్పింస్తుదని, జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్ లు,నార్కోటిక్ జగిలాలతో తనిఖీలు చేపడుతూ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపడం జరుగుతుదన్నారు. గంజాయి మత్తు పదార్థాలను అక్రమ రవాణాకు చెక్ పెడుతూ గంజాయిని పట్టుకుంటున్నారే గాని వాటిని సేవించే వారిని గుర్తించడం కష్టంగా మారిందని,ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీస్ గంజాయి తాగే వారిని గుర్తించడానికి అన్ని పోలీస్ స్టేషన్లలోకి గంజాయి టెస్ట్ కిట్లు అందుబాటులోకి తీసుకవచ్చాయని డ్రంక్ అండ్ డ్రైవ్ తరహాలోనే,గంజాయి టెస్ట్ లు నిర్వహించి వాటికి బానిసైన వారిని పట్టుకోవడం జరుగుతుదన్నారు.జిల్లాలో గంజాయి సేవించేవారు ఇకనుంచి పోలీసుల చేతిలో తప్పించుకోలేరని హెచ్చరించారు. జిల్లాలో గంజాయి కిట్ల సహాయంతో గతంలో గంజాయి కేసులల్లో నిందుతులుగా ఉన్న వారు వారి ప్రవర్తనలో మార్పు వచ్చిందా లేదా అనే నేపథ్యంలో,అనుమాస్పదంగా తిరుగుతు కనపడిన వారిని సిరిసిల్ల, ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట్, గంభీరవుపేట్ పోలీస్ స్టేషన్లలో గంజాయి కిట్స్ తో పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చిన వారిని మరియు వారికి గంజాయి సరఫరా చేసిన వారిని 8 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద 390 గ్రాముల గంజాయి,05 గంజాయి సిగరెట్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు

# విమాన టికెట్ల ధరలను కేంద్రం నియంత్రించలేదు: రామ్మోహన్ నాయుడు



న్యూఢిల్లీ: ఎయిర్ విస్తారా ఎయిర్లైన్స్లో టికెట్లు బుక్ చేసుకోవడానికి ఎంపీలు ప్రయత్నించినపుడు టికెట్ల ధరలు అమాంతం పెరిగిపోతున్నట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ జరుపుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు లోక్సభకు హామీ ఇచ్చారు. ఎపిలు చేసిన ఫిర్యాదుతోపాటు స్పీకర్ ఓం బిర్లా చేసిన ప్రస్తావనపై మంత్రి గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో సమాధానమిచ్చారు. చెన్నై-ఢిల్లీ రూట్లో ఎయిర్ విస్తారాలో టికెట్ బుక్ చేయడానికి తాను ప్రయత్నించిన ప్రతిసారి టికెట్ ధర దాదాపు రూ. 25,000 వరకు చూపుతోందని డిఎంకె సభ్యుడు దయానిధి మారన్ అనుబంధ ప్రశ్న వేశారు. అయితే తాను బుకింగ్ ప్రక్రియ పూర్తి చేసే సమయానికి టికెట్ ధర మూడు రెట్లు పెరిగి ఉంటుందని ఆయన చెప్పారు. విస్తారా నిర్వహించే అదే టాటా గ్రూపునకు చెందిన సాఫ్ట్వేర్ దిగ్గజం టిసిఎస్ టికెట్ ధర పెరిగే విధంగా ఏదైనా టెక్నాలజీనివాడుతోందా అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. స్పీకర్ ఓం బిర్లా మధ్యలో జోక్యం చేసుకుంటూ పలువురు ఎంపీల నుంచి తనకు కూడా ఇదే విషయమై ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఎంపీల టికెట్ల ఖర్చు పార్లమెంట్ నుంచి వెళుతున్నందున దీనిపై దర్యాప్తు చేయాల్సి ఉంటుందని ఆయన అన్నారు. దీనికి మంత్రి స్పందిస్తూ ఈ అంశంపై దర్యాప్తు జరిపిస్తామని హామీ ఇచ్చారు. మరో ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ తాను పౌర విమానయాన మంత్రిత్వశాఖను చేపట్టిన నాటి నుంచి విమాన ప్రయాణం సామాన్యులకు అందుబాటులో ఉండేవిధంగా ప్రయత్నిస్తున్నానని చెప్పారు. అయితే విమాన టికెట్ల ధరలు ప్రభుత్వ నియంత్రణలో ఉండవని ఆయన చెప్పారు.

# వీటీడీఏ పనుల్లో వేగం పెంచాలి

### - సమీక్ష సమావేశంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ వేములవాడ:** వేములవాడ టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీ(వీటీడీఏ) పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వీటీడీఏ పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని కాన్ఫరెన్స్ హాలులో ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీటీడీఏ పనులు ఎప్పుడు మొదలు పెట్టారు? ఎక్కడి వరకు పూర్తి అయ్యాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుడి చెరువులో బండ్ అండ్ పార్క్ నిర్మాణ పనులను రూ. 12 కోట్లతో మొదలు పెట్టామని, వచ్చే నెలాఖరులోగా పూర్తి చేస్తామని టూరిజం శాఖ అధికారులు తెలిపారు. బండ్ పార్క్ పనుల్లో భాగంగా నటరాజ, సూర్య నమస్కారం విగ్రహాలు, అంఫీథియేటర్, ఇంటర్నల్ పాత్ వే, జోన్ వన్ ప్లాంటేషన్ పూర్తి కాగా, లాండ్ స్కేప్, గ్రానైట్ ఫ్లోరింగ్ తదితర పనులుహా పూర్తి అయ్యాయని తెలిపారు. వీటీడీఏ పనుల్లో భాగంగా ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోహాదాదాపు ఎకరం విస్తీర్ణంలో రూ. 2 కోట్లతో మున్సిపల్ పార్క్ నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయని తెలిపారు. వేములవాడ నియోజక వర్గంలోని తిప్పాపూర్, మారుపాకలో మోడల్ లేఅవుట్ పనులు తుది దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. బద్ధి పోచమ్మ ఆలయ నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించి, ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. శివార్చన స్టేజ్ పనులపై సమీక్ష నిర్వహించారు. ఇక్కడ వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ ఈఓ వినోద్ రెడ్డి, టూరిజం శాఖ డీఈ విద్యాసాగర్, జేఈ జీవన్, ఆలయ ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, వీటీడీఏ సెక్రటరీ అన్సారీ, ఎస్టేట్ ఆఫీసర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నారా లోకేశ్ రెడ్‌బుక్‌పై వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ:** హత్యలు, అత్యాచారాలు, ఆస్తుల ధ్వంసంతో ఏపీ రివర్స్ డైరెక్షన్లో వెళ్తోందని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించే వారే ఉండకూడదనే రీతిలో రాష్ట్రంలో అణచివేత పాలన కనిపిస్తోందని అన్నారు. బాధితులు కేసు పెట్టడానికి వెళ్తే.. వారిపైనే రివర్స్ కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. మిథున్ రెడ్డి మీద దాడి చేసి ఆయనపైనే కేసులు పెట్టారని మండిపడ్డారు. వినుకొండ హత్యకేసులో టీడీపీ నేతలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని జగన్ ప్రశ్నించారు. మదనపల్లి ఫైల్స్ అంటూ ఏదేదో ప్రచారం చేస్తున్నారని అన్నారు. వినుకొండ ఘటనను దారి మళ్లించేందుకే మదనపల్లి ఇష్యూ తెచ్చారని విమర్శించారు. డైవర్షన్ పాలిటిక్స్ చేయడంలో చంద్రబాబు నాయుడు దిట్ట అని జగన్ విమర్శించారు. మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో అగ్ని ప్రమాదం జరిగితే.. అది కుట్ర అంటూ దుష్ప్రచారం చేశారని అన్నారు. దీనికి పెద్దిరెడ్డికి లింక్ పెడుతున్నారని మండిపడ్డారు. ఆర్డీవో ఆఫీసులో ఒకవేళ డాక్యుమెంట్లు కాలిపోతే అవే రికార్డులు ఎమ్మార్వో ఆఫీసులో, కలెక్టర్ ఆఫీసుల్లో ఉంటాయని తెలిపారు. అయినా ఏదో జరిగిపోతున్నట్లు దారుణంగా హైడ్రామా చేసి డైవర్షన్ పాలిటిక్స్ చేశారని మండిపడ్డారు. మదనపల్లికి హెలికాప్టర్ పంపించిన చంద్రబాబు నాయుడు.. ముచ్చుమర్రికి ఎందుకు హెలికాప్టర్ పంపించలేదని ప్రశ్నించారు. జగన్‌కు పేరు వస్తుందని దిశ పోలీస్ స్టేషన్లను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వైసీపీ లక్ష్యంగానే పల్నాడులో పోలీసు అధికారులను మార్చారని అన్నారు. న్యాయం, ధర్మం వైపు పోలీసులు నిలబడటం లేదని విమర్శించారు.

# కోరుట్లలో కారు కష్టాలు



**కరీంనగర్, జూలై :** మ్మడి కరీంనగర్ జిల్లాలో బీఆర్ఎస్ కంచుకోట కోరుట్ల నియోజకవర్గం. వరుసగా నాలుగు ఎన్నికల్లో ఆ పార్టీయే గెలిచింది. 2009లో కోరుట్ల నియోజకవర్గం ఏర్పడితే ఇప్పటివరకు ఆ పార్టీయే గెలుస్తూ వస్తోంది. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీచినా?. జగిత్యాల, కోరుట్లలో కారు పార్టీ జోరు చూపింది. ఆ తర్వాత జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కాంగ్రెస్ గూటికి చేరిపోగా..కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ మాత్రం కారు దిగనంటూ మొండికేస్తున్నారట. దీంతో ఆపరేషన్ కోరుట్లను మొదలు పెట్టింది కాంగ్రెస్. బీఆర్ఎస్ నేత కల్వకుంట్ల విద్యాసాగర్ కుటుంబానికి మంచి పట్టున్న ఈ నియోజకవర్గంలో ఇప్పుడు కొత్త సవాల్ ఎదుర్కొంటోంది. 2009లో తొలిసారి గెలిచినా ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ క్యాడర్? 2014 నుంచి అధికారం అనుభవించడంతో ఇప్పుడు ప్రతిపక్ష పాత్రలో ఇమడలేకపోతున్నారు. గత ఏడాది పార్టీ అధికారం కోల్పోవడంతో ద్వితీయ శ్రేణి నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ పునాదులే షేక్ అవుతున్నాయంటున్నారు. ఇలా ముఖ్యమైన నేతలు అంతా కారు దిగేస్తుండటం సిట్టింగ్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కు తలనొప్పిగా మారింది. రోజురోజుకూ కండువాలు మార్చే వారి సంఖ్య పెరుగుతుండటంతో కాంగ్రెస్ పార్టీలో జోష్ పెరుగుతోంది. బీఆర్ఎస్ డీలా పడుతోంది. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్ కు క్యాడర్ ను నిలుపుకోవడం సవాల్ గా మారింది. గతంలో ఆయన తండ్రి విద్యాసాగర్ రావు మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ ఎన్నికల్లో ఆయన స్వచ్ఛందంగా తప్పుకోవడంతో సంజయ్ కు చాన్స్ వచ్చింది. ఐతే గెలిచిన తొలిసారి ఆయన ప్రతిపక్షానికి పరిమితం కావడంతో క్యాడర్ ను కట్టడి చేయలేకపోతున్నారంటున్నారు. కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ పెద్ద ఎత్తున చేపట్టగా, సంజయ్ మాత్రం ఆకర్ష్ కు ప్రభావితం కాలేదని చెబుతున్నారు. ముఖ్యంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో మంచి సంబంధాలు ఉండటంతో బీఆర్ఎస్ లో కొనసాగేందుకే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. ఐతే ఇక్కడ కాంగ్రెస్ ప్లాన్ బీ అమలు చేస్తూ?. కోరుట్లలో కారును గ్యారేజ్ కు పంపేలా కార్యకర్తలపై ఫోకస్ చేసింది. గత ఎన్నికల్లో ఓటమి పాలైన జువ్వాడి నరసింగరావుకు కోరుట్లలో పూర్తి బాధ్యతలు అప్పగించింది. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉండటం.. నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే కన్నా జువ్వాడి మాటే చెల్లుబాటు అవుతుండటంతో గులాబీశ్రేణులు కాంగ్రెస్ వైపు చూస్తున్నాయట. దీంతో నియోజకవర్గంలో కాంగ్రెస్ పునాదులను గట్టిపరచుకోవాలనే ఉద్దేశంతో చురుగ్గా పావులు కదుపుతున్నారు జువ్వాడి నరసింగరావు. బీఆర్ఎస్ క్యాడర్ ను తనవైపు తిప్పుకుంటూ?. ఎమ్మెల్యేకు సవాల్ విసురుతున్నారు. మాజీ మంత్రి దివంగత రత్నకరరావు వారసుడిగా రాజకీయాల్లోకి అడుగు పెట్టిన నరసింగరావు? ఇప్పటివరకు గెలవలేకపోయారు. కానీ, పార్టీ అధికారంలో ఉండటంతో ఇన్చార్జిగా కోరుట్ల రాజకీయాన్ని ఇప్పుడు శాసిస్తున్నారు. కోరుట్ల మున్సిపల్ చైర్మన్ తో సహ పలువురు కౌన్సిలర్లను కాంగ్రెస్ లోకి చేర్చుకున్నారు. మెట్‌పల్లి మున్సిపల్ కౌన్సిలర్లు కూడా కాంగ్రెస్ లో చేరేలా పావులు కదిపారు. మొత్తానికి నియోజకవర్గంలో ప్రధానమైన పట్టణాల్లో పట్టు సాధిస్తూ ఒక్కో అడుగే వేస్తున్నారు జువ్వాడి నర్సింగరావు. వచ్చే స్థానిక ఎన్నికల నాటికి నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రాబల్యం కనిపించేలా పావులు కదుపుతున్న జువ్వాడి నరసింగరావు? ఎమ్మెల్యే సంజయ్‌కు చుక్కలు చూపిస్తున్నారంటున్నారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ జోరుకు కళ్లెం వేసేలా ఎమ్మెల్యే ఎలా ముందుకు వెళతారనేది ఆసక్తిరేపుతోంది.

# రియల్ బూమ్ ఇవ్వనున్న బడ్జెట




**హైదరాబాద్, జూలై :** హైదరాబాద్ అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. చారిత్రక నగరం ఇప్పటికే ఐకాన్ గా గుర్తింపు సంపాదించింది. హైదరాబాద్ చుట్టు పక్కల అభివృద్ధి అనూహ్యమైంది. ఈ క్రమంలోనే దేశంలో మరే ఇతర ప్రాంతాల్లో లేనంతగా రియల్ ఎస్టేట్ రంగం విరాజిల్లుతున్నది. నగరం నుంచి ఎటూ 100 కి.మీ. మేరకు వ్యాపారం జోరుగా సాగుతున్నది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తో మరింత జవసత్వాలను నింపేటట్లుగా ఉంది. ప్రధానంగా రీజనల్ రింగ్ రోడ్డు, మూసీ డెవలప్మెంట్, మెట్రో రైలు విస్తరణ వంటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుతో ఆశలు రేకెత్తించాయి. దాంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. అలాగే హైడ్రాకి రూ.200 కోట్లు, ఎయిర్ పోర్టు వరకు మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్డుకు రూ.200 కోట్లు, పాత నగరానికి మెట్రో విస్తరణకు రూ.500 కోట్లు, మల్టీ మోడల్ సబర్బన్ రైలు ట్రాన్స్ పోర్టు సిస్టం కోసం రూ.50 కోట్లు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు కోసం రూ.1500 కోట్లు ప్రతిపాదించారు. రియల్ ఎస్టేట్ రంగానికి అవసరమైన అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని స్పష్టమైంది. స్కిల్స్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ, 17 వివిధ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించే సర్టిఫికేట్ కోర్సులను ప్రవేశపెడుతున్నది. ఈ యూనివర్సిటీ రంగారెడ్డి జిల్లాలోనే ఏర్పాటు చేయనుండడంతో ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో మరిన్ని ప్రాజెక్టులకు అవకాశం లభించింది. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం హైదరాబాద్ కి మణిహారం. ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ పలు ప్రాంతాలను అనుసందానం చేయడంతో హైదరాబాద్ నగరాభివృద్ధి మరింత వేగవంతమైంది. ఇలాంటి ఫలితాలను రాష్ట్రంలో మరిన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు రీజనల్ రింగ్ రోడ్డు ఉపయోగపడుతుంది. ఉత్తర భాగంలో 158.6 కి.మీ. పొడవున్న సంగారెడ్డి?తూప్రాన్?గజ్వేల్?చౌటుప్పల్ రోడ్డును, దక్షిణం భాగాన 189 కి.మీ.ల పొడవున్న చౌటుప్పల్?షాద్ నగర్?సంగారెడ్డి రోడ్డును జాతీయ రహదారులుగా ప్రకటించడానికి వీలుగా అప్ గ్రేడ్ చేయడానికి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రీజనల్ రింగ్ రోడ్డు హైదరాబాద్ కి ఉత్తర, దక్షిణ ప్రాంతాలను, తూర్పు, పడమర ప్రాంతాలను కలుపుతూ జాతీయ రహదారి నెట్ వర్క్ తో అనుసంధానం చేయనున్నారు. ఎక్స్ వే ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని దీని నిర్మాణానికి తగినంత భూమిని సేకరిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ మరింత ఊపందుకున్నది. ఇప్పటికే అనేక వెంచర్లు ఈ ఏరియాలో ఉన్నాయి. ఇప్పుడీ ప్రతిపాదనలతో అమ్మకాలు పుంజుకోనున్నాయని రియల్ ఎస్టేట్ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్డుకు మధ్య పరిశ్రమలు, వాణిజ్య సేవలు రవాణా పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ట్రిబుల్ ఆర్ ప్రాజెక్టులో ఉత్తర ప్రాంత అభివృద్ధికి రూ.13,522 కోట్లు, దక్షిణ ప్రాంతాభివృద్ధికి రూ.12,980 కోట్ల ఖర్చవుతుందని అంచనా. ఈ ఏడాదికి మాత్రం రూ.1,525 కోట్లు ప్రతిపాదించారు. ఎన్నాండ్లుగానో ప్రతిపాదిత ట్రిబుల్ ఆర్ ప్రాజెక్టు పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగుతున్నది. ఐతే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోయినా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించడం ద్వారా విశ్వాసం పెరిగింది. ఇన్నాండ్లుగా ఈ ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఐతే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తో ఇక రీజనల్ రింగ్ రోడ్డు పట్టాలెక్కుతుందని భరోసా కల్పించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కవ్వాల్ టైగర్ రిజర్వ్, వికారాబాద్ అనంతగిరి సర్క్యూట్, ఖమ్మం కనకగిరి, ఆదిలాబాద్ కుంటాల జలపాతం, కొత్తగూడెం కిన్నెరసాని, పాకాల, ఏటూరు నాగారం సర్క్యూట్ ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇకో టూరిజం అభివృద్ధి ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఆదాయ వనరులు సమకూర్చుకునే వ్యూహరచన చేస్తున్నది. ఈ ప్రాజెక్టులు ఏ ఏరియాలో చేపడితే ఆ ప్రాంతంలోనూ రియల్ ఎస్టేట్ ఊపందుకోనున్నది.

# డేంజర్‌లో దానం

**హైదరాబాద్, జూలై :** గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ పై ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలిచిన దానం నాగేందర్ ఆ తర్వాత అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ టికెట్ పై పోటీ కూడా చేశారు. ఒక పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేకు మరో పార్టీ టికెట్ ఇవ్వడంపైనా అప్పుడు చర్చ జరిగింది. పార్టీ మారిన ఎమ్మెల్యే దానం నాగేందర్ తన పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. స్పీకర్‌ను కూడా కలిశారు. వీరితోపాటు బీజేపీ కూడా ఇదే డిమాండ్‌ను మరింత సీరియస్‌గా చేస్తున్నది. బీజేఎల్పీ మహేశ్వర్ రెడ్డి ఏకంగా హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే హైకోర్టు ఆయన దాఖలు చేసిన పిటిషన్ పై కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎమ్మెల్యే దానం నాగేందర్ పై అనర్హత వేటు వేయాలని ఆయన స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. కానీ, తన ఫిర్యాదును స్పీకర్ స్వీకరించలేదని, తన ఫిర్యాదును స్పీకర్ స్వీకరించేలా ఆదేశించాలని ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు ధర్మాసనం ఈ రోజు కూడా ఈ పిటిషన్ పై వాదనలు విన్నది, తీర్పు కూడా ఇచ్చింది. ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిటిషన్ స్వీకరించాలని, పిటిషనర్‌కు ధ్రువీకరణ రశీదు కూడా ఇవ్వాలని ఆదేశించింది. సికింద్రాబాద్ పార్లమెంటు స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విజయం సాధించారు. ఇప్పుడు ఆ పార్లమెంటు స్థానంలోని అసెంబ్లీ నియోజకవర్గాలపై బీజేపీ కన్ను వేసినట్టు ప్రచారం జరుగుతున్నది. పార్టీ మారిన దానం నాగేందర్ పై వేటు పడితే.. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి మళ్లీ ఉప ఎన్నిక జరుగుతుందని,



అప్పుడు బీజేపీ ఆ సీటును కైవసం చేసుకోవచ్చనే ఆలోచనలో ఉన్నట్టు విశ్లేషణలు వస్తున్నాయి. దానం నాగేందర్‌తోపాటు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరిలపై దాఖలైన పిటిషన్లపైనా ఈ రోజు విచారణ జరిగింది. అయితే, స్పీకర్ నిర్ణయం తీసుకోవడానికి ముందే పిటిషనర్లు కోర్టుకు వచ్చారని ఏజీ తెలిపారు. స్పీకర్ ఇండిపెండెంట్ ట్రిబ్యునల్ అని, స్పీకర్ నిర్ణయంలో కోర్టుల జోక్యం ఉండదని చెప్పారు. సుప్రీంకోర్టు కూడా గతంలో ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసిందన్నారు. మూడు నెలలైనా స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్న వాదన సరైంది కాదని పేర్కొన్నారు. వివాదం కోర్టులో ఉన్నందున స్పీకర్.. పిటిషన్లను పరిశీలించలేదని, కోర్టు నిర్ణయం కోసం వేచి చూస్తూ ఉండొచ్చని వివరించారు.

# 28న విద్యా సదస్సును జయప్రదం చేయండి

## - యూటీఎఫ్ పిలుపు




**బద్వేలు:** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 28న ఆదివారం ఉదయం 10 గంటలకు జరగబోవు రాష్ట్రస్థాయి విద్యాసదస్సును జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తికావస్తున్న సందర్భంగా రాష్ట్రమంతటా స్వర్ణోత్సవాలు జరుగుతున్నాయని ఈ స్వర్ణోత్సవాల్లో భాగంగా వివిధ జిల్లాలలో సమకాలీన అంశాలపై రాష్ట్రస్థాయి సదస్సులు నిర్వహించి ఉపాధ్యాయులను చైతన్య పరచడం జరుగుతున్నదని తెలిపారు 2024 మే నెలలో సార్వత్రిక ఎన్నికలు జరిగిన నేపథ్యంలో రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని రాష్ట్ర పరిస్థితులను శ్వేత పత్రాల రూపంలో ప్రభుత్వం ముందుకు తీసుకొస్తున్నదని మరి శ్వేత పత్రాలలో వాస్తవ విషయాలు తెలియచేయటం జరుగుతున్నదని తెలిపారు ఇటీవల విడుదల చేసిన ఆర్థిక శ్వేత పత్రం కూడా ఇలాగే ఉందని గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అప్పులకుప్పగా మారిందని దీనికి ఆ రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానాలతో పాటు కేంద్ర ప్రభుత్వ విధానాలు కూడా కారణమని తెలిపారు ఈ నేపథ్యంలో దేశ రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై అవగాహన కలిగించే నిమిత్తం ఈనెల 28వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల బాలాజీ నగర్ నందు రాష్ట్ర విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఆర్థిక శ్వేత పత్రం వాస్తవాలు అన్న అంశంపై భక్తగా శ్రీ వి రాంభూపాల్ గారు అలాగే ప్రత్యామ్నాయ విద్యా విధానం అన్న అంశంపై యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ కె ఎస్ ఎస్ ప్రసాద్ గారు వివరిస్తారని తెలిపారుజిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విద్యా సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్ ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ నాయకులు గోపీనాథ్ వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు

# సిటీ పోలీస్ లలో నయా దందా




**హైదరాబాద్, జూలై :** హైదరాబాద్ సిటీ పోలీస్‌శాఖలో కొందరు అధికారుల తీరు విమర్శలకు దారితీస్తోంది. శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన పోలీసు అధికారులే? అక్రమార్కులకు? చీకటి వ్యవహారాలకు సహకరిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. తమకు సంబంధం లేని విషయాల్లో తలదూరుస్తూ వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతున్నారనే విమర్శలను ఎదుర్కొంటున్నారు. ఇటీవల కాలంలో జంట నగరాల్లో పలువురు పోలీసు అధికారుల తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఓ కీలక జోన్‌లో ఉన్నతాధికారి వ్యవహారశైలి డిపార్ట్‌మెంట్‌లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది. ఆయనతో వేగలేమంటూ దిగువస్థాయి సిబ్బంది ఉన్నతాధికారులకు లిఖిత పూర్తక ఫిర్యాదులు చేస్తున్నారంటే?. ఆయన ఎంతలా సతాయిస్తున్నారో అర్థమవుతోందంటున్నారు. ఆ ఉన్నతాధికారి తీరుతో న్యాయం కావాలంటూ వచ్చేవారికి అన్యాయమే ఎదురవుతోందంటున్నారు. సదరు అధికారి పనిచేస్తున్న కీలక జోన్‌లో భూముల విలువ ఎక్కువ. నిత్యం ఏదో ప్రాంతంలో ల్యాండ్ కబ్జా తగాదాలు చెలరేగుతూనే ఉంటాయి. ఇలాంటి కేసుల్లో బాధితులకు న్యాయం చేయాల్సిన అధికారి? సెటిల్‌మెంట్లను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. బాధితులు, కబ్జాదారుల మధ్య పంచాయితీ చేస్తూ అందినంత దోచుకుంటున్నట్లు చెబుతున్నారు. ఇక ఫ్యామిలీ గొడవలను కూడా ఆ అధికారి వదలడం లేదట? భార్యభర్తల తగాదాల్లోనూ డబ్బులే చూస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఇక ఇటీవల నగరంలో హత్యలు, దోపిడీలు వంటి నేరాలు పెరిగిపోయాయి. లా ఆర్డర్ అదుపు చేయడానికి నగరంలో రాత్రి పది గంటలు అయ్యేసరికి హోటల్స్, రెస్టారెంట్లు క్లోజ్ చేయాలని సిటీ పోలీసు శాఖ ఆదేశాలిచ్చింది. కానీ, ఆ అధికారి పర్యవేక్షణలో ఉన్న జోన్‌లో ఈ అదేశాలు అమలు కావడం లేదు. అర్ధరాత్రుల వరకు హోటల్స్, రెస్టారెంట్లు తెరచుకుంటూనే ఉన్నాయి. పలు వివాదాలకు కేంద్రంగా మారుతున్నాయి. ఆయా షాపుల నుంచి ఆ అధికారి మామూళ్లు వసూలు చేస్తుండటం వల్ల ఎవరూ ప్రశ్నించలేకపోతున్నారంటున్నారు. ఇక ఎవరైనా దిగువస్థాయి అధికారులు షాపులు, రెస్టారెంట్లు మూయించాలని చూస్తే? వాటి జోలికి వెళ్లొద్దంటూ సదరు అధికారి నేరుగా హుకుం జారీ చేస్తున్నారంటున్నారు. అంతేకాకుండా రౌడీ మూకలకు వత్తాసు పలకడం, ఎవరైనా కింద స్థాయి సిబ్బంది తన మాట వినకపోతే? టార్గెట్ చేసి వేధించడంతో ఆ జోన్‌లో పని చేయడమంటేనే దిగువస్థాయి సిబ్బంది హడలిపోతున్నారంటున్నారు. ఇటీవల కాలంలో ఆ జోన్‌లో వరుస హత్యలు చోటు చేసుకుంటున్నా.. ఆ అధికారి అస్సలు పట్టించుకోవడం లేదంటున్నారు. ఇన్ని ఆరోపణలు ఉన్న ఆ అధికారికి స్థానికంగా అధికార పార్టీ నేతలతో సత్సంబంధాలు ఉండటం వల్ల ఎవరూ ఏమీ చేయలేకపోతున్నారంటున్నారు. మొత్తానికి ఆ అధికారి వల్ల సిటీ పోలీసులపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# కొరకురాని కొయ్యగా ఏలేటీ



**హైదరాబాద్:** బీజేపీ అంటే క్రమశిక్షణకు మారు పేరు. పార్టీ పరంగా ఏ నిర్ణయం తీసుకోవాలన్నా.. ముందుగా వివిధ స్థాయిల్లో చర్చించాలి. ఢిల్లీ పెద్దల దృష్టికి తీసుకువెళ్లాలి. అక్కడి నుంచి గ్రీన్‌సిగ్నల్ వస్తేనే ముందుకువెళ్లాలి. రాష్ట్ర స్థాయి అంశాలైతే రాష్ట్ర పార్టీ చీఫ్ అనుమతి తప్పనిసరిగా ఉండాలి. పార్టీలో ఏ స్థాయి లీడర్ అయినా ఈ పద్ధతి పాటించాల్సింది. ఐతే బీజేఎల్పీ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాత్రం ఈ పద్ధతిని పాటించడం లేదట? తనకు తోచినది? తెలిసినది పార్టీ వేదికలపై బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారట. బీజేఎల్పీ లీడర్‌గా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలపై పార్టీకి సమాచారం ఉండకపోవడంతో కమలనాథులు గందరగోళం ఎదుర్కొంటున్నారట. పార్టీ పరంగా మహేశ్వర్‌రెడ్డిని సమర్థించాలా? తమకు సమాచారం ఇవ్వకపోవడాన్ని సీరియస్‌గా తీసుకోవాలో తేల్చుకోలేకపోతున్నారట బీజేపీ పెద్దలు. ముఖ్యంగా ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని టార్గెట్‌గా చేసుకుంటున్న మహేశ్వర్‌రరెడ్డి దూకుడు చూపుతున్నారు. అయితే పార్టీకి సమాచారమివ్వకుండా? తను సేకరిస్తున్న సమాచారాన్ని అత్యంత రహస్యంగా ఉంచుతుండటం వల్ల మహేశ్వర్‌రెడ్డి తన సొంత అజెండా అమలు చేస్తున్నారా? అనే అనుమానాలను రేకెత్తిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒంటరి పోరాటం చేస్తున్న మహేశ్వర్‌రెడ్డికి ఏమైనా రహస్య అజెండా ఉందా? అని బీజేపీ నేతలే ఆరా తీస్తుండటం చర్చనీయాంశంగా మారింది. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందే బీజేపీలోకి వచ్చిన మహేశ్వర్‌రెడ్డి? నిర్మల్ ఎమ్మెల్యేగా గెలిచారు. బీజేపీలోకి కొత్తగా వచ్చినా.. ఆయన సీనియారిటీ, వాగ్ధాటి, సామాజిక నేపథ్యం వంటివి పరిగణలోకి తీసుకుని బీజేఎల్పీ లీడర్‌గా అవకాశమిచ్చింది పార్టీ. అయితే పార్టీ శాసనసభాపక్ష నేతగా ఆయన పలు సంచలన ఆరోపణలు చేస్తూ? ఎప్పటికప్పుడు వార్తల్లో వ్యక్తిగా మారిపోయారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని టార్గెట్ చేస్తూ ఆర్ ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెట్టారు మహేశ్వర్‌రెడ్డి. ఈ విమర్శలు బాగా వైరల్ అవడంతో పార్టీలో ఆయనకు మంచి గుర్తింపే లభించింది. ఐతే, అప్పట్లో పార్లమెంట్ ఎన్నికలు ఉండటంతో పార్టీ కూడా ఈ విమర్శలను బాగా వాడుకుంది. సాక్ష్యాత్తూ ప్రధాని సైతం ఆర్ ట్యాక్స్ అంటూ విమర్శలకు దిగేలా చేసింది. ఐతే ఆ తర్వాత నుంచి మహేశ్వర్‌రెడ్డి విమర్శల దాడి సొంత పార్టీకి కూడా అర్థం కావడం లేదంటున్నారు. విపక్షంలో ఉన్నారు కదా అని మహేశ్వరరెడ్డి విమర్శలను కాంగ్రెస్ లైట్‌గా తీసుకుంటే? ప్రధాన ప్రతిపక్ష పాత్రను తమ స్థానంలో బీజేపీఎల్పీ నేత కనిపిస్తుండటంతో బీఆర్ఎస్ కూడా షాక్‌కు గురవుతోందట. ఇదే సమయంలో పార్టీలో కనీస సమాచారం లేకుండా? తన రహస్య అజెండాను అమలు చేస్తున్నారని బీజేపీ నేతల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయిప్రధానంగా ఫ్లోర్‌లీడర్‌గా ఎమ్మెల్యేలను సమన్వయం చేసే బాధ్యత మహేశ్వర్ రెడ్డిపైనే ఉంటుంది.. దీనికి రాష్ట్ర అధ్యక్షుడి సాయం కుడా తీసుకోవాల్సి ఉంటుంది. ఐతే ఈ పనిని పెద్దగా పట్టించుకోని మహేశ్వర్‌రెడ్డి? తాను టార్గెట్ చేసిన నేతలు, వారి కంపెనీలపై విమర్శలకు దిగుతుండటమే చర్చనీయాంశంగా మారింది. ఇలా ఆయన చేస్తున్న విమర్శలు పార్టీని సైతం ఇరకాటంలో పెడుతున్నట్లు చెబుతున్నారు. ఎమ్మెల్యేలతోపాటు.. పార్టీకి కూడా సమాచారం ఇవ్వకుండా స్వయంగా నిర్ణయాలు తీసుకోవడంపై విమర్శలు ఎదుర్కొంటున్నారు మహేశ్వర్‌రెడ్డి. దీంతో ఎమ్మెల్యేలు, పార్టీ, మహేశ్వర్‌రెడ్డికి మధ్య సఖ్యత లేదన్న ప్రచారం మొదలైంది. బీజేపీలోకి కొత్తగా రావడంతో మహేశ్వరరెడ్డి స్టైల్ ఎవరికీ అర్థం కావడం లేదని? వాస్తవానికి ఆయన ఎప్పుడూ డిఫరెంట్‌గా నడుస్తుంటారనే చెబుతున్నారు పరిశీలకులు. బీజేపీకన్నా ముందు కాంగ్రెస్‌లో పనిచేసిన మహేశ్వరరెడ్డి? అప్పట్లో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డితో తీవ్రంగా విభేదించే వారు. రేవంత్‌కు వ్యతిరేకంగా గ్రూపు రాజకీయాలు నడిపి హీట్ పుట్టించే వారు. అప్పట్లో మహేశ్వర్‌రెడ్డితో ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సన్నిహితంగా మెలిగేవారు. వీరి గ్రూపులో మొత్తం 9 మంది ఉండగా, అందులో మహేశ్వర్‌రెడ్డి తప్ప మిగిలిన వారంతా కాంగ్రెస్‌లో ఉండిపోయారు.